# 23

## సర్వజిత్




ఆటో దిగాడు హేమంత్.

ఎదురుగా ఫంక్షన్ హాలు. విద్యుత్ బల్బులతో కళకళలాడిపోతోంది. అప్పుడు రాత్రి సమయం ఎనిమిదిన్నర గంటలు కావస్తోంది.

ఫంక్షన్ హాలు గేటుకు ఒక ప్రక్కగా 'శృతి వెడ్స్ వేణు' అని రాసి, ఓ ప్రక్క వధువు ఫొటో, మరోప్రక్కన వరుని ఫొటో వేసి ఉన్న పెద్ద ఫ్లెక్సి బ్యానర్, చుట్టూ ఫ్రేముతో కట్టి ఉంది.

ఫంక్షన్ హాలు ముందు ఓ అరడజను పైగా రకరకాల కార్లు పార్కు చేసి ఉన్నాయి. మరో ప్రక్కన, ఎదురుగానూ పదిహేనుకు పైగా టూ వీలర్లు పార్కుచేసి ఉన్నాయి.

కచ్చితంగా అది పెద్దింటి వాళ్ల పెళ్లి లాగానే ఉంది.

ఈ రోజుల్లో పెద్దింటి వాళ్ళతో పోటీపడుతున్నట్లుగా మధ్యతరగతి వాళ్లూ, మధ్యతరగతి వాళ్లతో పోటీపడేట్లుగా కిందితరగతి వాళ్లూ శుభాశుభకార్యక్రమాలకి ఆడంబరాలకి పోతున్నారు.

ఇక పెద్దింటి వాళ్లు ఒకరితో ఒకరు పోల్చుకుని చేసే ఖర్చు వృధా చెప్పనక్కర్లేదు.

హేమంత్ ఆటోవాడికి డబ్బులిచ్చి నెమ్మదిగా హాలుగేటు వైపు వెళ్లాడు. ప్రహరిగోడ గేటు దగ్గర్నుంచి లోపలిగేటు వరకూ ఇరవై గజాల మేర రెడ్‌కార్పెట్ వేశారు.

లోపల గేటు దగ్గర సినిమా మేకప్ వేసుకున్న ఇద్దరమ్మాయిలు వస్తున్న అతిథులకు ఒకరు గులాబిపువ్వు ఇస్తుంటే, మరొకరు సెంటు స్ప్రే చేస్తున్నారు.

లోపలగేటు దగ్గర కొచ్చాడు హేమంత్. తెలిసినవాళ్లెవరూ కనిపించలేదు. ఇంతలో "హలో అంకుల్ బావున్నారా?" అంటూ పలుకరించింది గులాబి పువ్వు ఇచ్చిన అమ్మాయి. మేకప్‌లో ఉన్నామెను మొదట్లో గుర్తు పట్టలేకపోయాడు హేమంత్.

"హాయ్ బావా?" అంటూ వెనుకనుంచి పలుకరింపుతో భుజం తట్టాడు తన మేనత్తకొడుకు సాయిరామ్. సాయిరామ్ కూతురే గులాబిపువ్వు ఇచ్చిన అమ్మాయి.

"ఇదేనా రావడం?" సాయిరామ్ అడిగాడు హేమంత్‌ని.

"ఊc...."

## మిత్రమా... నువ్వు తప్ప...

పింగళి భట్టిప్రోలు బాలాదేవి

అంతటా నిశ్శబ్దం...
ఒక్క గడియారపు టిక్కు టిక్కు శబ్దం మాత్రం...
ఆ అర్ధరాత్రి అందకారపు తిమిర పుంజాలలో...
నాకేగాని రెక్కలుంటే
ఓ మిత్రమా...
ఎగిరెగిరి వద్దును నీ దగ్గరికి
నీ ఒడిలో రాలిపోవడానికి!
వెచ్చని నీ చేతివేళ్లు
నా భుజాలమీదుగా వెన్నెముక మీదుగా రాస్తుంటే
దుఃఖం నిండిన నా కన్నీళ్ళు
నీ ఒడిని నింపుతుంటే
నా మనసు దూదిపింజలా తేలికవుతూంటే
నన్నిలా పలకరిస్తూ ఎన్నేళ్ళయినా
నేనున్నానంటూ నన్ను గుర్తుంచుకుంటూ ఇన్నేళ్ళయినా
మిగిలింది నువ్వు తప్ప...
మరెవరూ లేరు!!!

"అత్తయ్యేదీ?"

"రాలేదురా.... బాగాలేదు...." అబద్ధం చెప్పాడు హేమంత్.

"అయ్యో! ఏం?" నొచ్చుకుంటూ అడిగాడు సాయిరామ్.

"మోషన్స్.... పెద్ద వయస్సు కదా...." మళ్ళీ అబద్ధం చెప్పాడు హేమంత్.

అతడిని లోపలికి తీసుకువెళ్లాడు సాయిరామ్. బాగా సందడిగా ఉందక్కడి వాతావరణం. హాల్లో ఓ మూల పాట కచేరి సాగుతోంది.

ఇన్‌సర్ట్‌లు, టైలు, కోట్లు, సూట్లు, షేర్వాణీలలో మగాళ్లు, పట్టుచీరలు, మెడనిండా ఆభరణాలు, జీన్స్, గాగ్రాలు, ఇంకా రకరకాల డ్రెస్సుల్లో ఆడవాళ్లు, ప్రత్యేకించి యువతులు...... చాలా సినిమా వాళ్లు చెప్పేట్లు అంతా రిచ్‌గా ఉంది వాతావరణం!

రూపాయలు తక్కువగానూ, డాలర్లు ఎక్కువగానూ కనిపిస్తున్నాయక్కడ.

ఇంతలో ఎవరో 'సాయీ' అని పిలిచారు.

"నువ్వెళ్లరా! నేనిక్కడ కూర్చుంటాను" అన్నాడు హేమంత్.

"అక్క స్టేజి దగ్గరుంది..... బిజీ కదా! బావగారేం పట్టించుకోరు గదా! అమ్మ ముందు కూర్చుంది. అమ్మతో మాట్లాడుతూ కూర్చుందువు గాని...." సాయిరామ్ అన్నాడు.

"కాస్సేపున్నాక నే వెళతాలే.... నువ్వెళ్లు.... ఎవరో పిలుస్తున్నారు." హేమంత్ చెప్పి మరోమాటకు అవకాశం ఇవ్వకుండా అక్కడ కూర్చుండి పోయాడు.

"సరే! కాస్సేపున్నాక ముందుకొచ్చెయ్....." అనేసి సాయిరామ్ హడావిడిగా వెళ్లిపోయాడు. సాయిరామ్ అక్క నందిని కూతురే పెళ్లికూతురు శృతి.

నందిని స్వయంగా వచ్చి పిలవలేదని హేమంత్ తల్లి అన్నపూర్ణ పెళ్లికి రావడం మానేసింది. దానికితోడు ఈమధ్య ఆవిడకి ఆయాసంగా ఉంటోంది. అంతేకాదు ఈమధ్య వాళ్లెవరూ తనను చూడడానికి రావడం లేదని తన అన్నగారు... అంటే సాయిరామ్ తండ్రి పోయాక తన పట్ల వారు శ్రద్ధచూపడం లేదనీ కూడా ఆమెకు కోపం. అందుకే మేనగోడలు నందిని కూతురు పెళ్లికి హేమంత్‌ని వెళ్లిరమ్మన్నది.

నిజానికి ఆ పెళ్లికి తల్లిని పంపించి, తను మానేద్దామనుకున్నాడు హేమంత్. "ఎవరూ వెళ్లకపోతే బాగుండదు. నువ్వైనా వెళ్లి నాలుగక్షింతలు వేసిరా! వాళ్ల తప్పులేవో వాళ్లదగ్గరే ఉంటాయి. మనం తప్పెందుకు అనిపించుకోవాలి?" అని తల్లి పదే పదే చెప్పడంతో, ఆవిడ మాట తీసెయ్యలేక, పెళ్లికి తనూ వెళ్లకపోతే ఆవిడ ఎక్కడ అలిగి రాద్ధాంతం చేస్తుందోనని బయలుదేరాడు హేమంత్.

మరో పావుగంట పోయాక నందిని రెండో తమ్ముడు పరమేశ్ అటుగా వెళుతూ హేమంత్‌నిచూసి:

"ఏమిటి బావా ఇక్కడ కూర్చున్నావ్? రా! అమ్మ అడుగుతోంది...." అంటూ బలవంతంగా లేవదీసి ముందుకు తీసుకువెళ్లి తన తల్లి ప్రక్కన హేమంత్‌ని కూర్చోపెట్టాడు.

"మీ అమ్మేది?" మేనత్త అడిగింది.

చెప్పాడు హేమంత్.

"మీ ఆవిడా, పిల్లలూ ఏరీ...?"

"రాలేదత్తయ్యా.... అమ్మకి బాగులేదు కదా! తోడుగా ఉండాల్సి వచ్చింది" మరో అబద్దాన్ని ఊతంగా అల్లాడు.

పెళ్లి బిజీలో ఉన్న నందిని అతన్ని గమనిస్తూనే ఉంది. మరో ఇరవై నిముషాలు పోయాక అటుగా వచ్చిన ఆమె హేమంత్‌ని పలుకరించింది.

"అత్తయ్యకి బాగా లేదా? అయ్యో.... పోనీ కారు పంపించనా వస్తుందేమో?!" అనడిగిందామె.

"వద్దులే.... మోషన్స్ కదా.... మళ్ళీ ఇబ్బంది పడుతుంది" హేమంత్ చెప్పాడు.

"అదీ నిజమే అనుకో..... కానీ అత్తయ్య లేకుండా..... మా అమ్మాయి పెళ్లి జరుగుతోంది మరి...." ఆమె మాట పూర్తి కాలేదు. పురోహితుడూ, ఆమె భర్తా పిలవడంతో హడావిడిగా వెళ్లిపోయింది.

వెళ్లిపోతున్న ఆమెను పరిశీలనగా చూశాడు హేమంత్. మనిషిలో చాలా మార్పు కనిపించిందతనికి. డబ్బు తెచ్చిన అతిశయం కనిపించింది. పిల్లలు సంపాదిస్తున్న డాలర్లు తెచ్చిన అతిశయమూ కనిపించింది. ఖరీదైన పట్టుచీరలో, అంతకంటె ఖరీదైన నగలతో పెద్దింటితనాన్ని ప్రదర్శిస్తున్నట్లే ఉంది.

యాదాలాపంగా మేనత్త కేసి చూశాడు. ఇదివరకటి అమాయకత్వం లేదామెలో. కొంచెం తెలివి మీరినట్లనిపించిందతనికి. పలుకరింపులో, ముఖంలో హావభావాలు ప్రకటించడంలో కొత్తగా ఆవిడలో వచ్చిన తెలివిదనం స్పష్టంగా కనిపిస్తోంది.

అప్పుడప్పుడు ఆవిడ ఏదో మాట్లాడుతోంది. హేమంత్ ఏమీ మాట్లాడ్డం లేదు. ఆవిడ ఏమైనా అడిగితే చెబుతున్నాడు. ఆవిడ ఏదైనా చెబితే 'ఊఁ ......ఆఁ......' అంటున్నాడు.

మేనత్త చెబుతున్నదివింటూ, స్టేజి ముందు హావభావాలు ప్రకటిస్తూ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతున్న నందినిని చూశాడు హేమంత్.

'ఒక్క క్షణం కూడా నిన్ను విడిచిపెట్టాలనిపించడం లేదు బావా?' ఎవరో

వెన్నుమీద చరచినట్లు, చెవుల్లో గంట వాయించినట్లు వినిపించాయా మాటలు.

ఉలిక్కిపడ్డాడు హేమంత్. ఏమయ్యాయా మాటలు? బాసలు? ఆ అలకలు.... సరాగాలు?....' కళ్ళజోడు తీసి కణతలు నొక్కుకున్నాడు హేమంత్.

సినిమాస్టార్‌లా లిప్‌స్టిక్ వగైరా వేసుకుని వచ్చిన ఒకామెతో మాట్లాడుతోంది నందిని గలగలనవ్వుతూ. ఆమె అలా మాట్లాడుతూనే క్రీగంట హేమంత్‌ని చూస్తోందని ఎవరికీ తెలియదు.

అసహనంగా కుర్చీలో కదిలాడు హేమంత్. అల్లుడు-అంటే నందిని భర్త గురించీ, అతని హోదా గురించీ, నందిని ప్రతిక్షణం అతడిని కనిపెట్టుకుని ఉండాల్సిన పరిస్థితి గురించీ మేనత్త చెబుతోంది - అదొక గొప్ప విషయంలాగా!

హేమంత్‌కి ఆవిషయాలేమీ వినాలని అనిపించడం లేదు. అవి ఖచ్చితంగా తనకి అక్కర్లేనివిషయాలని అతని అభిప్రాయం.

అయినా అంత నిస్సిగ్గుగా ఆవిడ అలా చెప్పడం అతడికి చికాగ్గా అనిపించింది. పాతికేళ్లనాటి వెనుకటి జీవితం ఆవిడ మర్చిపోయిందా అని అనుకున్నాడు. మీదపడ్డ వయస్సు కారణంగా అలా జరిగి ఉండవచ్చునని సరిపెట్టుకున్నాడు. కాని తనెలా మర్చిపోగలడు?!

మర్చిపోలేడు గనకనే ఆ పెళ్లికి తను వెళ్లకూడదనుకున్నాడు.

చాలా ఏళ్ల తర్వాత, తన మేనమామ - అంటే నందిని తండ్రి చనిపోయినప్పుడు నందినిని చూశాడు. ఎప్పుడైతే వస్తు వ్యామోహంలో పడి ఆమె తనను కాదని వెళ్ళిపోయిందో, ఆ క్షణమే జీవితంలో ఆమెను మళ్లీ చూడకూడదని నిర్ణయించుకున్నాడు.

కానీ, పరిస్థితులు తప్పడం లేదు.

తన కౌగిట్లో ఒదిగిపోయి, 'నువ్వు తప్ప నాకు వేరే ప్రపంచం లేదు'- అని కళ్లనీళ్లు సైతం పెట్టుకున్నదామె - ఇప్పుడు ఎంత నిర్లజ్జగా, తమ ఇద్దరి మధ్యా ఏమీ జరగనట్లు, ఏమీ లేనట్లు - ఎలా మాట్లాడగలుగుతోందో హేమంత్‌కి అర్థంకావడం లేదు.

హాల్లో సందడి చూస్తూ, మధ్య మధ్య మేనత్త మాటలు వింటూ అసహనంగా కుర్చీలో కదిలాడు హేమంత్. ఇంతలో పరమేశ్ టీ తీసుకువచ్చి వద్దంటున్నా బలవంతంగా ఇచ్చివెళ్లాడు అతనికి.

స్టేజీమీద నందిని భర్త ప్రక్కన నిల్చుని నవ్వులు చిందిస్తూంటే వీడియోగ్రాఫర్ మందపాన్ని కవర్ చేస్తూ వాళ్లిద్దర్నీ వీడియో తీస్తున్నాడు.

ఆ పరిస్థితుల్లోనూ ఆమె హేమంత్‌కేసి చూసింది. అతను టీ గ్లాసు పట్టుకుని కణతలకు రాసుకోవడాన్ని పరికించిందామె.

'తలనొప్పా! పెయిన్‌బామ్ రాయనా? నేను రాస్తే ఇట్టే తగ్గిపోతుంది.' ఎవరో చెవిలో అన్నట్లు ఉలికిపడ్డాడు హేమంత్. చటుక్కున స్టేజి పైకి చూశాడు. నందిని నవ్వుతోంది ఎవరితోనో మాట్లాడుతూ.

మేనత్త తన మనవరాలు శృతి పెళ్లి చేసుకోబోతున్న వేణు గురించి ఘనంగా చెబుతోంది. అతగాడు అమెరికాలో ఇంజనీరుగా పనిచేస్తున్నాట్ట. నెలకు ఎన్నివేల డాలర్లో వస్తాయిట. మన రూపాయల్లో చూసుకుంటే రెండు లక్షలకి పైమాటేనట నెలకి జీతం!




హేమంత్‌కి అవేమీ వినాలనిపించడం లేదు. అసలక్కడి వాతావరణమే అతనికి నచ్చడం లేదు. ఏదోగా ఉంది. చెప్పాలంటే కృతకంగా ఉంది.

నందిని కొడుకు - అతనికీ అమెరికాలోనే ఉద్యోగం - ఆమె మేనల్లుడూ, ఇంకా ఒకళ్లిద్దరు కుర్రాళ్లూ షేర్వాణీలు వేసుకుని హడావిడి చేస్తున్నారు.

మేనత్త ఇంకా కూతురు గురించి చెప్పడం పూర్తికాలేదు. చెబుతూనే ఉంది. అల్లుడు రోజూ తాగుతాట్ట. రేసులకి డబ్బు తగలేస్తాట్ట....

'ఏయ్! నువ్వు మందు ముట్టుకున్నా, సిగరెట్ కాల్చినా నేను చస్తే ఒప్పుకోను తెలుసా....' మళ్ళీ ఎవరో అన్నట్లు చెవుల్లో గింగురుమన్నాయా మాటలు. పాతికేళ్ల కిందట తన ఒడిలో పడుకుని నందిని అన్న మాటలివి.

తల విదిలించుకుని వేదికవైపు చూశాడు హేమంత్. నందిని, ఆమె భర్త పెళ్లి కొడుకు కాళ్లు కడుగుతున్నారు కన్యాదానం చేయడానికి.

వేదికమీద వీడియో వాళ్ల హడావిడి ఎక్కువ కనిపిస్తోంది దాదాపు నలుగురైదుగురు వీడియోగ్రాఫర్లు, ఫొటో గ్రాఫర్లూ దడికట్టేసినట్లు వేదికమీద ఏమీ కనిపించకుండా అడ్డంగా నిల్చున్నారు.

కాస్సేపటికి పూలతో అలంకరించిన బుట్టలో పెళ్లికూతుర్ని తీసుకువచ్చారు. పెళ్లితంతు ఉత్సాహంగానే సాగుతోంది. జీలకర్ర బెల్లం పెట్టినప్పుడు అందరితో బాటు హేమంత్ కూడా వెళ్లి వధూవరుల మీద అక్షతలు వేశాడు.

మంగళసూత్రధారణ అయింది. బహుమతులు చదివిస్తున్నారు. మేనత్త ఎవరితోనో మాట్లాడుతూంటే చటుక్కున లేచాడు హేమంత్. అతనికి చాలా అసహనంగా ఉంది. ముళ్ల మీద కూర్చున్నట్లుంది. నెమ్మదిగా బయటికి వచ్చేశాడు. భారంగా కణతలు నొక్కుకున్నాడు.

"పెళ్లికూతురి చేతిలో ఏంపెడతావ్? మరీ తక్కువ పెట్టకు. బావుండదు. ఓ వెయ్యి చదివిస్తావేమిటి? ఏదైనా వెండివస్తువు చదివిస్తే మంచిది మరి.... తర్వాత నీ యిష్టం....." పెళ్లికి బయలుదేరి వస్తుంటే తల్లి అన్న మాటలు గుర్తుకొచ్చాయి హేమంత్‌కి.

ఆ ఆర్భాటపు పెళ్లిలో తను ఇచ్చే గిఫ్ట్ ఏ మూల - అనుకున్నాడు. అతని మనసంతా అస్థిమితంగా తయారయింది. నడుచుకుంటూ బయలుదేరాడు. సిగరెట్ కాల్చాలని జేబులు తడుముకున్నాడు. లేవు. పాన్‌షాప్‌లో ఒక సిగరెట్ కొని ముట్టించి బయలుదేరాడు.

అరఫర్లాంగు వచ్చేసరికి ఎదురుగా అనాథపిల్లల ట్రస్ట్ కనిపించింది. అప్రయత్నంగా అందులోకి వెళ్లాడు. ఎదురుగా రిసెప్షన్‌లో ఉన్న అతను మర్యాదగా విష్ చేశాడు. జేబులోంచి వెయ్యి రూపాయలు తీసి అతనికి ఇచ్చి అన్నాడు హేమంత్. "రేపు ఉదయం పిల్లలకి స్వీటుతో బ్రేక్‌ఫాస్ట్ పెట్టండి" అని. "థ్యాంక్యూ సర్! ఎవరి పేరు మీద సర్?"

క్షణం ఆలోచించి తన దగ్గరున్న శుభలేఖ తీసి వధూవరుల ఇద్దరిపేర్లూ చూపించాడు హేమంత్.

"వెరీగుడ్ సర్! చాలా మంచి పని చేస్తున్నారు సర్" రిసెప్షనిస్టు మెచ్చుకుంటూ ఇంకా ఏదో అంటున్నాడు. హేమంత్ మౌనంగా బయటికి వచ్చేశాడు.